క్లుప్తంగా

పోస్టల్ పథకాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

గరిడేపల్లి : తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సబ్ పోస్టుమాస్టర్ ధరావత్ చందులాల్‌నాయక్, మెయిన్ పార్సరల్ గోల్లపల్లి కోటయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో పథకాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోస్టల్ శాఖ వారు అందించే పీఎల్ఓ, ఆర్పీఎల్ఐలో తక్కువ ప్రిమియం ఎక్కువ బోనస్ వస్తుందన్నారు. కార్యక్రమంలో పీఎంలు నరేష్, వీరాంజనేయులు, బీపీఎంలు పుల్లయ్య, నాగరాజు, రాము, ప్రియాంక, రాంబాబు, మహబుబ్‌పాష, వెంకటాచారి, సైదులు తదితరులున్నారు.

జాబ్‌కార్డుకు ఆధార్ లింక్ చేయించుకోవాలి

చిలుకూరు : ఉపాధిహామీ జాబ్‌కార్డుకు ఆధార్ నంబర్లు ఇచ్చి లింక్ చేయించుకోవాలని చిలుకూరు గ్రామపంచాయతీ కార్యదర్శి శోభన్ బాబు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉపాధిహామీ జాబ్‌కార్డులో ఉన్న ప్రతిఒక్కరూ తమ ఆధార్ జీరాక్స్‌లను గ్రామపంచాయతీ కార్యాలయంలో గాని, మండల ఉపాధిహామీ కార్యాలయంలో గాని అందజేయాలని సూచించారు.

బియ్యం పంపిణీ



బియ్యం, సరుకులు అందజేస్తున్న సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురం గ్రామానికి చెందిన జనిగ పిచ్చయ్య నాగమ్మ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో ఆదివారం జనచైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో 50కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పి.వంశీ, సభ్యులు పి.సాయి, పి.శివశంకర్, డి.రమేష్, బీవీ శ్రీపతి, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

నడిగూడెం : గ్రామపంచాయతీ వర్కర్లకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగు రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో గ్రామపంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, గ్రామపంచాయతీ వర్కర్లు వెంకన్న, శ్రీను, సుభాన్, వీరస్వామి, పీరయ్య, నాగభూషణం, రామకృష్ణ, అంజయ్య పాల్గొన్నారు.

ఎస్ఐ రవికి సన్మానం



ఎస్ఐ రవిని సన్మానిస్తున్న యూత్ సభ్యులు

మఠంపల్లి : జిల్లాలో అండర్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఉత్తమ ఎస్ఐగా అవార్డు స్వీకరించిన స్థానిక ఎస్ఐ ఇరుగు రవిని ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో గిరిజన యూత్‌సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు మాఫియా ముఠాల ఆగడాలు అరికట్టేందుకు మరింతగా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూక్యా బాలు, సతీష్, వినోద్, వెంకి, గోపి, రాజా, తదితరులున్నారు.

గౌడ జనహక్కుల సమితి కార్యదర్శిగా మల్లయ్యగౌడ్

మోతె : మండల కేంద్రానికి చెందిన నకిరకంటి మల్లయ్యగౌడ్ గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన గౌడ జనహక్కుల పోరాట సమితి ఆత్మీయ సమ్మేళనంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యేలికట్టె విజయకుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చౌగోని శ్రీనివాస్‌గౌడ్ ఈ ఎన్నికను ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కారింగుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మామిడి సీతారాములుగౌడ్, వెంకన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెలిదండ గ్రామంలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీరోడ్లు, రూ.20లక్షలతో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, అభివృద్ధిలో ప్రతిపక్షాలు పోటీపడాలని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజ, సర్పంచ్ ఆదూరి పద్మ, ఆదూరి కోటయ్య, ఎంపీటీసీ ములకలపల్లి విజయరవి, పార్టీ మండల అధ్యక్షులు గుగులోతు కృష్ణానాయక్, పార్థసారధి, పెండెం వీరస్వామి, బాలకృష్ణ, కోనాయిగూడెం సర్పంచ్ సోమిరెడ్డి లక్ష్మీ వెంకట్‌రెడ్డి, చామకేరి వీరయ్య, రామ్‌మోహన్, సోమయ్య, వీరాంజనేయులు, వెంకటేష్, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

బీమా సౌకర్యానికి సహకారం అందిస్తా

హుజూర్‌నగర్ : ప్రైవేట్ విద్యుత్ వర్కర్లకు, టెక్నీషియన్లకు బీమా సదుపాయానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్, టెక్నీషియన్స్ ఫెడరేషన్ (టీపీఈటీఎఫ్) నియోజకవర్గ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యుత్ వర్కర్లు ప్రమాదపు అంచున పనిచేస్తున్నారని, వారికి ప్రభుత్వం నుంచి బీమా సౌకర్యం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, టీపీఈటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి బాలస్వామి, రాష్ట్ర నాయకులు యు.రాజేశ్వరరావు, బ్రహ్మాచారి, ఏఎల్ఓ మంజుల, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శ్రవణ్, సత్యనారాయణ, నాయకులు జక్కుల నాగేశ్వరరావు, రామచంద్రయ్య, సైదారావు, సైదులు యూనియన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతి



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు ఇస్తున్న వేతనాలను పెంచాలని ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీదేవి, హేమలత కోరారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మెప్మా ఆర్పీలకు నెలకు ఇస్తున్న రూ.4వేల గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంచాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శాసనసభలో ప్రస్తావించాలని, అదేవిధంగా సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు మెప్మాఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కోటిరెడ్డికి పలువురు ప్రముఖుల పరామర్శ



హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్, నాయకులు

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన నంద్యాల కోటిరెడ్డి (వికారాబాద్ ఎస్పీ)ని ఆదివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కోటిరెడ్డి తండ్రి హనుమారెడ్డి దశదినకర్మ సందర్భంగా పలువురు ప్రముఖులు, అధికారులు హాజరై సంతాపం తెలిపి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఖమ్మం జిల్లా కలెక్టర్ పీవీ.గౌతమ్, సూర్యాపేట అదనపు కలెక్టర్ మోహన్‌రావు, కోదాడ, నల్లగొండ, హుజుర్‌నగర్, నల్లగొండ, తాండూరు ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జ్ కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి, పలు పార్టీల ప్రతినిధులు, నాయకులు ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్ జిల్లాలకు చెందిన అధికారులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

మునగాల : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్లా శ్రీశైలం అన్నారు. మండలంలోని నేలమర్రిలో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం అర్ధరాత్రి వరకు ముందస్తు బోధకాలు వ్యాధి నిర్ధారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 500మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ స్పెషల్ డ్రైవ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.నిరంజన్ పర్యవేక్షణలో చేపట్టినట్లు రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్లా శ్రీశైలం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. సేకరించిన రక్త నమూనాలను జిల్లా ఫైలేరియా ల్యాబ్‌కు పంపించినట్లు వెల్లడించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతిఒక్కరూ విధిగా దోమల బారి నుంచి కాపాడుకునేందుకు విధిగా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ జలగం సోమయ్య, జిల్లా ఉప మలేరియా అధికారి షాబుద్దీన్, సబ్‌యూనిట్ అధికారి అంజయ్య, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ బి.స్వాతి, కవిత, హెల్త్ అసిస్టెంట్లు లింగం రామకృష్ణ, మధుకర్, లింగయ్య, సురేష్, ఏఎన్ఎంలు శాంతమ్మ, లలిత, పద్మ, నరసమ్మ, నాగమణి, సుచరిత, మమత, పావని, ఆశవర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల మెరుగునకు కృషి



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : మున్సిపాలిటీలో మౌలిక వసతుల మెరుగునకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 18,19 26,27 వార్డుల్లో రూ.62లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతివార్డులో సీసీరోడ్డు, డ్రెయినేజీల సమస్య లేకుండా చూస్తానని అన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నట్లు, పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ వెంపటి పద్మ, కౌన్సిలర్లు కందుల కోటేశ్వరరావు, కత్రి శివ, కోళ్ల లక్ష్మీప్రసన్న, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దీక్షను విజయవంతం చేయాలి

కోదాడరూరల్ : అనాథ పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టనున్న అనాథ పిల్లల అరిగోస దీక్షను విజయవంతం చేయాలని ఎంఎస్పీ కోదాడ పట్టణ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని దొరకుంటలో అనాథ పిల్లల అరిగోస దీక్షపై ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 2015లో సీఎం కేసీఆర్ అనాథ పిల్లలను ప్రభుత్వమే అన్ని విధాలుగా చూసుకుంటుందని, వారికి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, కుల, ఆదాయానికి స్మార్ట్‌కార్డులు అందజేస్తామని, ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒగ్గు ఏసోబు, పిడమర్తి వెంకట్రావ్, నారకట్ల శ్రీను, కుటుంబరావు, రాజేష్, రమేష్, క్రాంతి, సాయి, భీష్మ, దాసు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బుర్రి శ్రీరాములు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై అర్థరహితమైన ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ మాట్లాడారు. కలకోవ గ్రామ మత్స్య సహకార సంఘంలో 30ఏళ్లుగా జరుగుతున్న అక్రమాలను నిరూపిస్తాం, బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సీపీఎం ముసుగులో శ్రీరాములు సొసైటీని అడ్డుపెట్టుకొని బోగస్ సభ్యులు, అర్హతలేని సభ్యులతో కొన్నేళ్లుగా అంతా తానే నడిపిస్తూ రూ.కోట్లు అర్జించాడని ఆరోపించారు. పేదల నాయకుడిగా చెప్పుకునే శ్రీరాములు భూస్వామిగా కొనసాగుతూ 40ఎకరాల భూమికి యజమానిగా, రూ.30లక్షల కారులో దర్జాగా తిరుగుతున్నాడని అన్నారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొంపెల్లి వీరబాబు మాట్లాడుతూ.. మత్స్య సహకార సంఘంలో జరుగుతున్న అవినీతిని కొందరు సభ్యులు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లారని, దీంతో ఎమ్మెల్యే సొసైటీలో జరిగే అవినీతి, అక్రమాలను అరికట్టి అర్హులైన సభ్యులకు న్యాయం జరిగేంత వరకు ఎన్నికలు వాయిదా వేయాలని కోరగా దీనిని శ్రీరాములు వక్రీకరించి ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, గన్నా నరసింహారావు, చిర్రా శ్రీనివాస్, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, యుగంధర్ రెడ్డి, వెంపటి భీష్మారావు, అమరగాని నర్సయ్య, దొంతగాని లింగయ్య, చినసైదులు, లింగయ్య, వీరభద్రం, వీరబాబు, తిర్పయ్య పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మహాసభకు తరలివెళ్తున్న నాయకులు

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మండాది సైదులు, మండల అధ్యక్షుడు పి.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో జరిగే ఫెడరేషన్ 3వ మహాసభకు వెళ్తూ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. సాధారణ మరణం చెందిన ఎలక్ట్రికల్ కార్మికుడికి రూ.5లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 50ఏళ్ల దాటిన ప్రతికార్మికుడికి రూ.5వేల వరకు పింఛన్లు ఇవ్వాలని, కార్మికశాఖలో పేర్లు నమోదైన ప్రతిఒక్కరికి వడ్డీలేని రుణాలను రూ.5లక్షల వరకు ఇవ్వాలని, దళిత బంధు మాదిరిగానే ఎలక్ట్రికల్ బంధు ఇవ్వాలని కోరారు. మహాసభకు వెళ్లిన వారిలో నాయకులు మందపాటి సైదారాజు, మండాది సైదులు, మేకపోతుల నాగయ్య, బాజోజు తిరుపతిచారి, పెండెం కాశయ్య, నాయకులు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు



దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు చేస్తున్న నాయకులు

కోదాడ : పట్టణంలోని బోడిగుట్టపై నిర్మించిన లింగమంతుల, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులను పట్టణంలోని పలు వార్డుల్లో ప్రత్యేక వాహనంతో ఉంచిన ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకర్షణగా నిలుస్తున్న ప్రదర్శనలు..

లింగమంతుల దేవాలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠ కోసం పట్టణంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు ప్రదర్శిస్తున్న సంప్రదాయ నృత్యాలు, కోలాట ప్రదర్శనలు పట్టణవాసులను ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు, పట్టణంలోని బొడ్రాయి కమిటీ, ముత్యాలమ్మ కమిటీ, రైతు సంఘం ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రధాని మోదీ పాల్గొన్న మన్ కి బాత్ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను బీజేపీ నాయకులు గ్రామగ్రామాన ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.చంద్రారెడ్డి, డి.యల్లయ్య, డి.రామరాజు, జి.సతీష్, సీహెచ్.సోమయ్య, ఎం.వెంకటేశ్వర్లు, వై.సోమరాజు, కె.గోపాల్, ఎస్.వెంకటేశరాజు, కె.శంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హజ్రత్ ఖాజా గరీబ్‌నవాబ్ ఉర్సు ప్రారంభం



గంధం తీసుకొస్తున్న నిర్వాహకులు, పెద్దలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో దక్షిణ భారత అజ్మీర్‌గా పేరుగాంచిన హజ్రత్ ఖాజా గరీబ్‌నవాబ్ 79వ ఉర్సు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా నుంచి తీసుకొచ్చిన సందల్ (గంధాన్ని) ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉర్సు నిర్వాహకులు, మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం రాత్రి జరిగే ఉర్సుకు నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఉర్సు అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్‌అసిఫ్‌అలీ, ఇంతియాజ్‌అలీ, ఫయాజ్‌అలీ, బాజాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ, బొడ్రాయి వార్షికోత్సవం



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మఠంపల్లి : మండలంలోని జామ్లా, ఊమ్లాతండాల పరిధిలో గల ఉమ్మడి గ్రామదేవతలైన ముత్యాలమ్మ, బొడ్రాయి వార్షికోత్సవాన్ని ఆదివారం గిరిజనులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు బోనాలతో భారీ ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా గిరిజనులు యాటపోతులను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల తండాలకు చెందిన గిరిజనులు హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : గ్రామాల్లోని క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో పోంచర్ల నియోజకవర్గ వాలీబాల్ క్రీడాకారుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు 14, 16, 18, 21ఏళ్లలోపు విద్యార్థులకు కోచింగ్ క్యాంప్‌లు, ఫ్రెండ్లీ మ్యాచ్‌లు, టోర్నమెంట్‌లను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ క్రీడాకారులు జోగు వెంకటరెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి, పీడీ బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మైసయ్య, ప్రదీప్, రమేష్, గోవిందరెడ్డి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ప్రభుత్వం సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురవయ్య

హుజూర్‌నగర్ : చిరు, వీధి వ్యాపారులకు ప్రభుత్వం సహకరించాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లకొండ గురవయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో చిరు, వీధి వ్యాపారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా తర్వాత వీధుల వెంట వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్లు, చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వ్యాపారులను ప్రభుత్వం ముద్ర యోజన పథకం, కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సైదా, జానయ్య, ప్రియ, ఇబ్రహీంజ జానిమియా, అజయ్, శ్రీను, ఆదాంబి, జాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు వెంటనే పంపిణీ చేయాలి

నేరేడుచర్ల : రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలైనా నేటి వరకు ఆసరా పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సాయి, నరేష్ తదితరులున్నారు.

పదోన్నతి పొందిన ఉద్యోగులకు సన్మానం

గరిడేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో పోస్టల్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారిని ఆదివారం మండల కేంద్రంలో స్థానిక పోస్టాఫీసులో సబ్ పోస్టుమాస్టర్ ధరావత్ మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. తాళ్లమల్కాపురంలో బీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న రాయికింది నరేష్, గరిడేపల్లి ఎస్ఓలో ఏబీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న గూడపూడి వీరాంజనేయులు డిపార్ట్‌మెంట్ పోస్టుమాన్‌గా, మేడారం ఏబీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న రామనర్సు దాచారం బీపీఎంగా పదోన్నతి పొందారు. కార్యక్రమంలో మిర్యాలగూడ హెడ్ పోస్టుమాస్టర్ లక్ష్మీనారాయణ, సిరాజుద్దీన్, హుజూర్‌నగర్ సబ్‌పోస్టమన్ ఖాజామీయా, రాము, ఉపేందర్‌రెడ్డి, చంద్రయ్య, పుల్లయ్య, రాము, నాగరాజు, బలరాం, అంజి, సైదులు, రాంబాబు, ప్రియాంక, మహబుబ్ బాషా, వెంకటాచారి, సైదులు, సంజీవ్, ప్రవీణ్, సంతీష్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోతె : మండల పరిధిలోని మామిళ్లగూడెంలో 1993–94 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు అప్పటి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాయమవుతున్న గుట్టలు

- ప్రభుత్వ భూముల్లో రాత్రి సమయంలో జరుపుతున్న బ్లాస్టింగ్‌లు
- టిప్పర్లతో రాయిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న వివిధ శాఖల అధికారులు



చిలుకూరు : సీతరాంపురం గుట్టలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రదేశం

చిలుకూరు : వందేళ్ల చరిత్రలు కలిగిన గుట్టలు పలువురు అక్రమార్కుల చేతుల్లో పిండవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా పలువురు అక్రమార్కులు అక్రమంగా ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలను రాత్రికి రాత్రే బ్లాస్టింగ్‌లు జరిపి తెల్లవారే సరికి టిప్పర్ల ద్వారా రాయిని తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ వ్యవహారమంతా చిలుకూరు మండల పరిధిలోని సీతారాంపురం గ్రామపరిధిలో గల గుట్టల్లో జరుగుతుంది.

చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సీతారాంపురం శ్మశానవాటిక, మండల మెగా పల్లెప్రకృతి వనానికి వెళ్లే దారిలో 979 సర్వేనంబర్‌లో వందల ఎకరాల భూమి ఉంది. ఈ సర్వే నంబర్‌లో ప్రభుత్వ, పట్టా భూమి ఉంది. కాని ఎవరిది పట్టా భూమి, ఎవరిది సీలింగ్ భూమి తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సర్వే నంబర్‌పై పలుమార్లు రెవెన్యూ అధికారులు సర్వేలు చేసినా పూర్తిస్థాయిలో ఏ రైతు భూమి ఎక్కడ ఉందో ఎవరిది పట్టా భూమి అనే విషయాన్ని తేల్చలేకపోతున్నారు.

రాత్రికి రాత్రే బ్లాస్టింగ్..

కాని పలువురు వ్యక్తులు ఈ సర్వేనంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారు. రాత్రికి రాత్రే బ్లాస్టింగ్ చేసి తెల్లవారేసరికి రాయిని టిప్పర్లతో కషర్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్టల్లో విచారణ చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మిర్యాలగూడెం మైనింగ్ అధికారులను వివరణ కోరగా తమకు ఎలాంటి విషయం తెలియదని..విచారణ చేస్తామని తెలిపారు.